# వ్యాపారదక్షత

(గల్పిక)

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

మా రాఘవయ్య మామ చూస్తుండగా ఎంత పారిశ్రామికుడైనాడు! ఎంత పెద్దమేడ కట్టించాడు! ఎన్నిలక్షలు సంపాయించాడు!

ఇప్పుడాయన వేదాంతంమొదలుకొని సినిమాకళవరకూ దేన్నిగురించన్నా మాట్లాడగలడు. ఏ విషయం మాట్లాడినా ఆ విషయంలో చెయ్యితిరిగినవాళ్ళే నోరు తెరుచుకు వింటారు.

మా మామసంగతి నాకెవరూ చెప్పక్కర్లేదు. ఆయన ముప్ఫైరూపాయల ఉద్యోగంకోసం అడ్డమైన కాళ్ళూ పట్టుకోవటం నే నెరుగుదును. ఆయన బియ్యంవర్తకం పెట్టి దివాలాతీయటం నే నెరుగుదును. దివాలా తీసింది వర్తకమేగాని, మా మామ కాదు. వర్తకం దివాలాతీయటం, అతివిచిత్రమైన సంఘటన. ఇరవై ఏళ్లు అంతులేని లాభాలు ఆర్జించిపెట్టిన వ్యాపారమైనా సరే ఒక ఏడు తగిన లాభాలివ్వకపోయినా, ఇక ఆ వ్యాపారంలో లాభాలకు ఎక్కువ అవకాశం లేని పరిస్థితి ఏర్పడినా అది దివాలా తీస్తుంది.

మా మామ వ్యాపారంలో లాభాలు చేశాడు. కాని అవి ఎట్లా వచ్చిందీ ఆయనకు తెలీదు. అదంతా ఆయనగుమాస్తా చూసేవాడు. ఒక వంక వ్యాపారంలో లాభాలు తీస్తున్న రోజుల్లోనే మా మామయ్యకు బజారుకుపోయి టోపీ పడకుండా గజం వల్లగుడ్డ తీసుకురావటం చాతకాదు.

"మీ మామయ్య బజారులోకి అడుగుపెట్టగానే షాపుల వాళ్ళంతా టోపీలు పైకి తీస్తార్రా, రాముడూ" అనేది మా సుందరమ్మత్తయ్య.

పరిశ్రమల్లో ప్రవేశించటానికి డబ్బున్నది; వ్యాపారంలో సంపాదించినది. కాని మా రాఘవయ్యమామకు పరిశ్రమంటే ఏం తెలుసు? అందులో ఆయన ఎట్లా లాభాలు చేశాడు? ఈవిషయం నా కాశ్చర్యం వేసేది. మామామ అకస్మికంగా తెలివిగలవాడైనాడంటే నేను నమ్మలేదు.

"ఏం, మామా? ఏమిటి నీరహస్యం? ఈ పరిశ్రమలో నువు టోపీపడలేదా" అన్నాను.

"పడకేంరా? నా తెలివితక్కువ చూసి పనికిమాలిన యంత్రాలన్నీ నాకు అంటగట్టి మధ్యవాళ్లు చాలా దోచారు. పదివేల ఖరీదు చేసేదానికి ఇరవై వేలు ఖర్చయింది." అన్నాడు మామామ.

"మరి ఇట్లా పైకి ఎట్లా రాగలిగావు?" అన్నాను.

"ఆ కిటుకు నువే చెబితివి కాదుట్రా?"

నాకు చెప్పలేని ఆశ్చర్యం వేసింది.

"ఏం చెప్పాను?" అన్నాను.

"పారిశ్రామికుల నిజమైన లాభాలు కార్మికులశ్రమ అపహరించటంద్వారా వస్తాయని నువు చెప్పలేదూ?"

నాకు జ్ఞాపకంలేదు. చెప్పానేమో!

"నాకదేమంత కష్టంగా కనిపించలేదు." అన్నాడు, అమాయకుడు, మా రాఘవయ్య మామ!

---

## నేటి ప్రపంచం

లకు కూడా సహాయం చెయ్యడానికి అమెరికా సిద్ధంగా ఉంది.

తూర్పు ఆసియా దేశాలలోని అమెరికన్ రాయబారులందరూ బాంకాక్‌లో అమెరికన్ విదేశాంగశాఖ ఉపకార్యదర్శి డా॥ జరిప్ జెసప్ అధ్యక్షతకింద సమావేశమై పరిస్థితుల్ని పరిశీలించారు. కమ్యూనిజం వ్యాప్తి నరికట్టడానికి ఒక కార్యక్రమాన్ని అమెరికన్ విదేశాంగ కార్యాలయానికి సూచించారు. తూర్పుఆసియా దేశాలకు అయుధపరికరాల సప్లై, ఆర్థికసహాయం చెయ్యడానికి కొన్ని సూచనలు చెయ్యబడినాయి.

కామన్వెల్తులోని ఇండియా, పాకిస్తాన్, సింహళాలకు, మలయాకు చెయ్యవలసిన సహాయంగురించి కొలంబోసమావేశం చేసిన నిర్ణయాలను అమలు జరపడానికి ఈ రాయబారుల సమావేశం నిర్ణయించింది.

సైనికంగా కూడా అమెరికా తన నౌకాబలాన్ని పసిఫిక్ మహాసాగరంలోనే అధికంగా కేంద్రీకరించాలని ఆసియాపర్యటించిన అమెరికన్ సైనికాంగప్రధానులు నిర్ణయించారు.

యూరప్‌లో కమ్యూనిస్టుల్ని ప్రతిఘటించడంలో గ్రీస్‌లో బలాబలాలు పరీక్షించుకోవడం జరిగింది. అలాగే ఆసియాలో బలాబలాలు పరీక్షించుకోడానికి ఇండోచీనా తగిన ప్రదేశమని నిర్ణయించబడింది. నార్వే, పశ్చిమజర్మనీ, గ్రీస్, టర్కీ, పర్షియా, అఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్, ఇండియా, నేపాల్, సయాం, ఇండోచీనా, మలయా, ఫిలిప్పైన్స్, జపాన్ దేశాల్లో అనగా కమ్యూనిస్టుదేశాల చుట్టూ గల దేశాలలోకి కమ్యూనిజం ప్రవేశించకుండా కాపాడ్డం అమెరికా ప్రధానాశయం.

ఇప్పుడు ఈదేశాల్లో కల్లా ఇండోచీనాలో ఇరుపక్షాలకూ స్థావరం ఏర్పడింది. ఒక పక్షాన్ని గెంటెయ్యాలని మరొకపక్షం యత్నిస్తోంది. మొత్తానికి ఇండోచీనా యుద్ధరంగమయ్యే ప్రమాదం ఆసన్నమయింది.

[సూర్యనారాయణ]

---



షేక్ బేగంసాహెబ్

హరికథా కాలక్షేపములు చేయుటలో మంచిప్రావీణ్యత సంపాదించి హైదరాబాదు ప్రాంతంలో హిందూ మహమ్మదీయ ఐక్యత కొరకు ప్రచారంచేస్తున్న మహమ్మదీయ బాలిక. నాట్యకళా ప్రావీణ్యతకూడా వున్నది. ఈమెను 'బేబీరాణి' అనికూడా పిలవటంకద్దు.